RNI. No. APTEL/2011/41055




# ప్రభాత సమాచారం

తెలంగాణ తెలుగు దినపత్రిక




సంపుటి : 13 సంచిక : 19 ఆదిలాబాద్ ఎడిటర్ - సయ్యద్ కరీం శుక్రవారం, 26 జూలై 2024 పేజీలు : 4 వెల : 2/-

# బడ్జెట్ 2.91 లక్షల కోట్లు

## రేవంత్ సర్కారు తొలి పూర్తిస్థాయి పద్దు




హైదరాబాద్ : ఉమ్మడి ఏపీ విభజన తర్వాత అందరి కళ్లూ తెలంగాణ బడ్జెట్ మీదనే ఉన్నాయంటే అతిశయోక్తి కాదేమో..? హైదరాబాద్ వంటి నగరాన్ని కలిగి ఉండడమే దీనికి కారణంగా చెప్పాలి. అలాంటిది ఇప్పుడు హైదరాబాద్ ఉమ్మడి రాజధాని కాదు. తెలంగాణ సొత్తుగా మారాక.. ఈ నగరం నుంచి వచ్చే ఆదాయం తెలంగాణకే చెందుతుంది. అంటే ఏపీకి ఆదాయం పంచాల్సిన అవసరం లేదు. మరోవైపు రేవంత్ రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక ఇదే తొలి పూర్తి స్థాయి బడ్జెట్. ఈ నేపథ్యంలో ఆరు గ్యారంటీలతో అధికారంలోకి వచ్చిన రేవంత్ సర్కారు ఎలాంటి బడ్జెట్ ప్రవేశ పెడుతుంది అనేది ఆసక్తికరంగా మారింది. మరి ఈ అంచనాలను నిలుపుకొనేలా తెలంగాణ బడ్జెట్ ఉన్నదా?

**వ్యవసాయానికి పెద్దపీట..** తెలంగాణ డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క గురువారం ప్రవేశపెట్టని రాష్ట్ర బడ్జెట్ రూ. 2,91,159 కోట్లు. ఇందులో మూలధన వ్యయం రూ. 33,487 కోట్లు. పన్ను ఆదాయం 1,38,181.26 కోట్లు, పన్నేతర ఆదాయం రూ. 35,208.44 కోట్లు. కేంద్ర పన్నుల్లో వాటా 26.216.28 కోట్లు, కేంద్రం గ్రాంట్లు 21,636.15 కోట్లు. కాగా.. ఈ ఏడాది రూ. 57,112 కోట్లు అప్పుగా తీసుకోవాలని ప్రతిపాదించారు. బడ్జెట్ లో అత్యధికంగా వ్యవసాయ రంగానికి రూ. 72,659 కోట్లు కేటాయించారు. ఆ తర్వాత దళిత సంక్షేమానికి ప్రాధాన్యం దక్కింది. ఇందుకు రూ. 33,124 కోట్లు ఇచ్చారు. మూడో స్థానంలో పంచాయతీరాజ్ రూరల్ డెవలప్ మెంట్ (29,816 కోట్లు) ఉండడం గమనార్హం.

**నీటి పారుదుల, విద్యకు సమానంగా..** రేవంత్ ప్రభుత్వం ప్రాధాన్య రంగాలుగా భావిస్తున్న నీటిపారుదలకు బడ్జెట్ లో రూ. 22,301 కోట్లు, విద్యకు రూ. 21,292 కోట్లు ఇచ్చింది. ట్రాన్స్ కో, డిస్కంలకు రూ. 16,410 కోట్లు, ఉద్యానశాఖకు రూ. 737 కోట్లు, పశు సంవర్ధవ శాఖకు రూ. 1,980కోట్లు, స్త్రీ, శిశు సంక్షేమానికి రూ. 2,736 కోట్లు, ఎస్టీ సంక్షేమం రూ. 17,056 కోట్లు,మైనార్టీ సంక్షేమం రూ. 3,003కోట్లు, బీసీ సంక్షేమం రూ. 9,200 కోట్లు, వైద్య, ఆరోగ్యం రూ. 11,468 కోట్లు, అడవులు, పర్యావరణం రూ. 1,064 కోట్లు, పరిశ్రమల శాఖకు రూ. 2,762 కోట్లు, ఐటీ శాఖకు రూ. 774 కోట్లు కేటాయించింది.

**సిలిండర్ పథకానికి..** ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపునకు కీలకమైన రూ. 500 గ్యాస్ సిలిండర్ పథకానికి రేవంత్ సర్కారు తొలి పద్దులోనే భారీగా నిధులిచ్చింది. దీనికి రూ. 723 కోట్లు ఇవ్వనుంది. గృహజ్యోతికి రూ. 2,418 కోట్లు, ప్రజాపంపిణీ వ్యవస్థకు రూ. 3836 కోట్లు, రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్)కు రూ. 1,525 కోట్లు, హోం శాఖకు రూ. 9,564 కోట్లు, రోడ్లు, భవనాల శాఖకు రూ. 5,790 కోట్లు ఇచ్చింది. బడ్జెట్ లో మూల ధన వ్యయం రూ. 33 వేల 487 కోట్లుగా పేర్కొన్న రేవంత్ ప్రభుత్వం.. తెలంగాణ ఏర్పాటు నాటికి రూ. 75,577 కోట్ల అప్పు ఉందని వెల్లడించింది. తమ ప్రభుత్వం వచ్చాక రూ. 42 వేల కోట్ల బకాయిలు చెల్లించినట్లు చెప్పింది.

# గ్యాస్ సిలిండర్లకు 723 కోట్లు.. ఉచిత విద్యుత్‌కు 2,418 కోట్లు



హైదరాబాద్: తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి తీసుకురావడంలో కీలక భూమిక పోషించిన ఆరు గ్యారంటీలకు రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో పెద్దపీట వేసింది. అధికారంలోకి వచ్చిన కొన్నాళ్లకే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ. 500కే గ్యాస్ సిలిండర్లు వంటి పథకాలను ప్రారంభించిన సర్కారు.. తాజా బడ్జెట్‌లో వాటికి నిధులు కేటాయించింది. ఆరు గ్యారంటీల్లో మరికొన్ని పథకాలనూ ఈ సందర్భంగా ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క తన బడ్జెట్ ప్రసంగంలో ప్రస్తావించారు. పెరిగిన గ్యాస్ సిలిండర్ ధర నుంచి ఊరట కల్పించేందుకు మహాలక్ష్మి పథకం కింద రూ. 500కే వంటగ్యాస్ సిలిండర్‌ను తమ ప్రభుత్వం ప్రారంభించిందని భట్టి విక్రమార్క తెలిపారు. ఈ పథకం వల్ల ఇప్పటి వరకు 39,57,637 కుటుంబాలకు లబ్ధి చేకూరిందని, ఇందుకు రూ. 200 కోట్లను ప్రభుత్వం వెచ్చిందన్నారు. ఈ బడ్జెట్‌లో గ్యాస్ సిలిండర్ల కోసం రూ. 723 కోట్లు ప్రతిపాదిస్తున్నట్లు చెప్పారు. మహిళను మహాలక్ష్మిగా గౌరవించడం మన సంస్కృతి అని, మహాలక్ష్మి పథకం కింద తెలంగాణ రాష్ట్రంలోని మహిళలందరికీ టీజీఆర్‌టీసీ నడిపే బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించామని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ప్రయాణించే దూరంపైన, ప్రయాణించే పర్యాయాలపైన ఎటువంటి పరిమితీ విధించలేదని చెప్పారు. ఇప్పటి వరకు 68.60 కోట్ల ప్రయాణాలను మహిళలు చేశారని, పర్యవసానంగా మహిళలకు రూ. 2,351 కోట్లు ఆదా అయ్యిందన్నారు. ఉచిత బస్సు సౌకర్యం పరోక్షంగా రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి తోడ్పడుతోందని పేర్కొన్నారు. ఈ పథకానికి అయ్యే ఖర్చు ఆర్టీసీకి ప్రభుత్వం నెలవారీగా చెల్లిస్తోందని, దీనివల్ల ఆర్టీసీ సంస్థ కూడా ఆర్థికంగా బలోపేతమై బిలియన్ డాలర్ కార్పొరేషన్‌గా అవతరించడానికి దోహదపడుతుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఈ ఏడాది మార్చి 1 నుంచి గృహజ్యోతి పథకాన్ని అమలు చేస్తున్నామని భట్టి విక్రమార్క తన బడ్జెట్ ప్రసంగంలో ప్రస్తావించారు. 200 యూనిట్ల కంటే తక్కువ విద్యుత్‌ని వినియోగించుకొనే గృహాలకు ఉచిత విద్యుత్ అందించడం ఈ పథకం ప్రధాన లక్ష్యమన్నారు. ప్రజాపాలన-ప్రజా సేవ కేంద్రాల ద్వారా వచ్చిన ధరఖాస్తులను స్వీకరించి అర్హులైన వారందరికి ఈ ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేస్తున్నామని చెప్పారు. ఈ పథకం కింద అర్హులైన లబ్ధిదారులకు డిస్కంలు సున్నా బిల్లులు జారీ చేస్తున్నాయని, ప్రభుత్వం ఆ బిల్లుల మొత్తం ఛార్జీలను డిస్కంలకు చెల్లిస్తుందని చెప్పారు. జులై 15 నాటికి 45,81,676 ఇళ్లల్లో వెలుగుల జిలుగులు నింపగా.. జూన్ వరకు అందించిన విద్యుత్తుకుగానూ డిస్కంలకు ప్రభుత్వం ఇప్పటి వరకు రూ. 583.05 కోట్లు చెల్లించిందన్నారు. ఈ బడ్జెట్‌లో ఉచిత విద్యుత్‌కు రూ. 2,418 కోట్లు కేటాయిస్తున్నట్లు చెప్పారు. నిరుపేదల సొంతింటి కలను నెరవేర్చడమే తమ ప్రధాన కర్తవ్యమని భట్టి విక్రమార్క అన్నారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో పేర్కొన్న విధంగా తమ ప్రభుత్వం 'ఇందిరమ్మ ఇళ్లు' నూతన గృహ నిర్మాణ కార్యక్రమాన్ని ప్రారంభించిందని, ఈ పథకం కింద పేదలు ఇల్లు కట్టుకోవడానికి రూ. 5 లక్షలు ఆర్థిక సాయం అందించాలని నిర్ణయించామన్నారు. ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు రూ. 6 లక్షలు చెల్లిస్తామన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ప్రతి నియోజకవర్గంలో కనీసం 3,500 ఇళ్ల చొప్పున మొత్తం 4,50,000 ఇళ్ల నిర్మాణానికి సహకారం అందించాలని నిర్ణయించామని తెలిపారు. రెండు పడక గదుల ఇళ్ల పథకం కింద పూర్తయిన ఇళ్లను త్వరలోనే కేటాయిస్తామన్నారు. పూర్తికాని వాటిని సత్వరమే పూర్తి చేసి మౌలిక వసతులను కల్పించి అర్హులకు అందజేస్తామన్నారు. గత ప్రభుత్వ హయాంలో రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యానికి సకాలంలో చెల్లింపులు జరిగేవి కాదని, తమ ప్రభుత్వం 48 గంటల్లోనే చెల్లింపులు చేస్తోందని భట్టి విక్రమార్క అన్నారు. ఇప్పటి వరకు రూ. 10,556 కోట్ల రూపాయలు రైతుల ఖాతాల్లోకి జమ చేశామన్నారు. అర్హులైన రైతులకు మాత్రమే లబ్ధి చేకూరేలా రైతుబంధు పథకం స్థానే రైతు భరోసాను తమ ప్రభుత్వం తీసుకొచ్చిందని భట్టి విక్రమార్క అన్నారు. ఈ పథకం ద్వారా అర్హులైన రైతులకు ఏటా ఎకరానికి రూ. 15,000 చెల్లించాలన్నది ప్రభుత్వ సంకల్పమన్నారు. దీని అమలుకు విధివిధానాలు చర్చించి నిర్ణయించడానికి ఒక క్యాబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేశామన్నారు. ఈ కమిటీ ఇప్పటికే పలువురి అభిప్రాయాలను సేకరించిందని, వాటిని సభలో సభ్యులందరి అభిప్రాయాన్ని తీసుకొని అమలు చేయాల్సిన విధి విధానాలపై తగిన నిర్ణయం తీసుకుంటామని ప్రకటించారు. తెలంగాణలో వరి సాగు చాలా విస్తృతంగా జరుగుతుందని, పండిన పంటకు సరైన ధర రాక పెట్టుబడి కూడా దక్కక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని భట్టి విక్రమార్క అన్నారు. రాష్ట్రంలో సన్న రకం వరి ధాన్యాల సాగును ప్రోత్సహించడానికి ప్రభుత్వం 33 రకాల వరి ధాన్యాలను గుర్తించి, వాటిని పండించిన రైతుకు క్వింటాలుకు రూ. 500 బోనస్ చెల్లించాలని నిర్ణయించిందన్నారు. దీనివల్ల సన్నరకాల వరిని పండించే సాగు భూమి విస్తీర్ణం పెరిగి, రైతులకు ఆర్థిక ప్రయోజనం చేకూరుతుందని చెప్పారు.



## గ్యారెంటీలను గంగలో కలిపేసిన కోతల, ఎగవేతల బడ్జెట్: కేటీఆర్

హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ 'ఎక్స్' వేదికగా స్పందించారు. ఇది ప్రజల ఆకాంక్షలను పట్టించుకోని ఆంక్షల పద్దు అని విమర్శించారు. గ్యారెంటీలను గంగలో కలిపేసిన కోతల, ఎగవేతల బడ్జెట్ అని ఎద్దేవా చేశారు. విధానం, విషయం, విజన్ లేదని, పేర్ల మార్పులతో ఏమార్చిన డొల్ల బడ్జెట్ ప్రవేశపెట్టారని ధ్వజమెత్తారు. వాగ్దానాలను గాలికొదిలిన వంచనల బడ్జెట్.. డిక్లరేషన్లను బుట్టదాఖలు చేసిన దోకేబాజ్ బడ్జెట్ అంటూ మండిపడ్డారు. "రైతులకు కత్తిరింపులు.. అన్నదాతలకు సున్నం. ఆడబిడ్డలకు అన్యాయం.. మహాలక్ష్ములకు మహామోసం. అవ్వాతాతలు, దివ్యాంగులు, నిరుపేదలు, నిస్సహాయులకు మొండిచేయి. పింఛన్ల పెంపు మాటెత్తలేదు. దళితులను దగా చేశారు.. గిరిజనులను మోసం చేశారు. అంబేద్కర్ అభయహస్తం ఊసులేదు.. శూన్యహస్తమే మిగిలింది. బడుగు బలహీనవర్గాలకు భరోసాలేదు. వృత్తి కులాలపై కత్తికట్టారు"అని కేటీఆర్ పోస్టు పెట్టారు.




# పూర్తి స్థాయిలో ఆకట్టుకున్న 'రేవంతుడి పద్దు'!

హైదరాబాద్ : ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సభలో బడ్జెట్ ప్రతిపాదనలను ప్రవేశపెట్టారు. సరిగ్గా మధ్యాహ్నం 12 గంటలకు తన బడ్జెట్ ప్రసంగాన్ని ప్రారంభించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రవేశపెట్టబోతోన్న తొలి పూర్తిస్థాయి బడ్జెట్ ఇదే కావడం ప్రాధాన్యతను సంతరించుకుంది. తెలంగాణ బడ్జెట్‌లో మొత్తం వ్యయం 2,91,159 కోట్ల రూపాయలు. రెవెన్యూ వ్యయం 2,20,945 కోట్ల రూపాయలు. ఇక మూల ధన వ్యయం మొత్తాన్ని 33,487 కోట్ల రూపాయలుగా భట్టి విక్రమార్క ప్రతిపాదించారు. ఊహించినట్టే బడ్జెట్ కేటాయింపుల్లో వ్యవసాయ శాఖకు అధిక ప్రాధాన్యత ఇచ్చారు. ఈ క్రమంలో రైతులపై వరాల జల్లును కురిపించారు భట్టి విక్రమార్క. ఈ సంవత్సరం తాము ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజనలో చేరబోతోన్నామని అన్నారు. దీని ద్వారా అన్నదాతలకు రైతు బీమాను వర్తింపజేయాలని నిర్ణయించుకున్నామని చెప్పారు. ఫసల్ బీమా యోజన కింద రైతులు చెల్లించాల్సిన ప్రీమియం మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వమే చెల్లిస్తుందని వివరించారు. ప్రజలపై అదనంగా ఎలాంటి పన్నులను

# సామాన్యుడు మెచ్చేలా

## ఎక్స్‌ట్రా పన్నులకు నో భూముల అమ్మకాలకు సై

విధించకూడదని రేవంత్ రెడ్డి ప్రభుత్వం భావిస్తోంది. పన్నులు వేయడం వల్ల వచ్చే ఆదాయాన్ని ప్రత్యామ్నాయ వనరుల ద్వారా సమీకరించుకోవడానికి ప్రాధాన్యత ఇస్తోంది. ఈ క్రమంలో బ్యాంకులు, వివిధ ఆర్థిక సంస్థల వద్ద అప్పులు చేయడం, భూములను అమ్మకానికి పెట్టడం వంటివి మార్గాలను ఎంచుకున్నట్టే కనిపిస్తోంది. 2024-2025 ఆర్థిక సంవత్సరంలో పన్నేతర ఆదాయం 35,208.44 కోట్ల రూపాయలుగా అంచనా వేసింది. ఇన్ని వేల కోట్ల రూపాయల మొత్తాన్ని ఎలా సమీకరిస్తుందనేది ప్రశ్నార్థకం. దీనికి సంబంధించిన వివరాలను కూడా బడ్జెట్ ప్రతిపాదనల్లో ఎక్కడ కూడా పొందుపర్చనట్టే. ఈ మొత్తాన్ని భూముల అమ్మకం ద్వారా సమీకరించాలనేది ఓ ప్రత్యామ్నాయం. ఈ టార్గెట్‌ను గనక అందుకోలేకపోతే- రుణాలను తీసుకోవడానికే మొగ్గు చూపించడం ఖాయంగా కనిపిస్తోంది. అదే సమయంలో వివిధ సంక్షేమ పథకాలకు కేటాయించిన నిధుల్లో కోత పెట్టినా ఆశ్చర్యపోనక్కర్లేదని అంటున్నారు.

## సంపాదకీయం

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

# 'మేకిన్ ఇండియా' విఫలమా? సఫలమా?

మేకిన్ ఇండియా–2014–19 మధ్య కాలంలో దేశవ్యాప్తంగా వినిపించిన నినాదం ఇదే. కేంద్ర మంత్రుల నుంచి రాష్ట్రాల్లోని బీజేపీ నాయకుల వరకు కూడా .. మేకిన్ ఇండియాకు పెద్దపీట వేస్తున్నామని చెప్పారు. దీనికి కారణం.. కొత్తగా అప్పట్లో అధికారంలోకి వచ్చిన ప్రధాని మోడీ.. స్వదేశీ వస్తువుల వినియోగానికి పెద్దపీట వేస్తున్నట్టు ప్రకటించారు. దీంతో మేకిన్ ఇండియా కార్యక్రమం ఉవ్వెత్తున సాగింది. అప్పట్లో మేకిన్ ఇండియా పేరుతో కొత్త రుణాలు కూడా ఇచ్చారు. అయితే.. ఇప్పుడు ప్రవేశ పెట్టిన బడ్జెట్ ను కొంత లోతుగా పరిశీలిస్తే.. మేకిన్ ఇండియా విఫలమైనట్టే కనిపిస్తోంది. కానీ, 2014–19 మధ్య కాలంలో ప్రవేశ పెట్టిన ఐదు బడ్జెట్‌లలో మేకిన్ ఇండియాకు పెద్ద ఎత్తున పన్నుల రాయితీ ప్రకటించారు. ప్రోత్సాహకాలు ఇచ్చారు. ప్రధాని ఎక్కడికి వెళ్లినా.. మేకిన్ ఇండియా గురించే చెప్పేవారు. కానీ.. దీని ద్వారా.. ప్రపంచ దేశాల నుంచి ఎదురవుతున్న ఒత్తిళ్లను భరించలేని పరిస్థితి వచ్చినట్టుగా కనిపిస్తోంది. నిజానికి చైనా.. భారతీయ బొమ్మల రంగాన్నే కాకుండా.. పటాకుల రంగాన్ని కూడా ఆక్రమించేసింది. ఇప్పుడు సెల్ ఫోన్లు, దుస్తుల రంగాన్ని కూడా ఆక్రమించింది. దీనికి ఆటకట్టించే ఉద్దేశంతోనే మేకిన్ ఇండియా జపం చేసిన.. మోడీ.. ఇప్పుడు ప్రవేశ పెట్టిన బడ్జెట్లో మాత్రం విదేశాలకు పెద్ద పీట వేశారు. ఎంతగా అంటే.. రెడ్ కార్పెట్ పరిచేంతగా.! ఈ–కామర్స్ సంస్థలకు టీడీఎస్ తగ్గించారు. తద్వారా.. విదేశీ వస్తు విపణిని ఇంట్లోకే తెచ్చేసినట్టు అయింది. ఆన్‌లైన్ షాపింగ్‌లో తగ్గనున్న ధరలు: ద్వారా.. స్థానిక ఉత్పత్తుల మార్కెట్‌లు నేల మట్టం ఖాయం. ఇప్పటికే మేకిన్ ఇండియా దెబ్బకొట్టిందనే వాదన ఉన్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. దీంతో మరింతగా దేశీయ వస్తు తయారీ రంగం నిలువునా మునిగిపోతుంది. క్యాపిటల్ గెయిన్స్ విధానం సరళీకరణ: ఇది.. విదేశీ వ్యాపార వేత్తలకు కొంగు బంగారం. తద్వారా.. దేశీయంలో మరింత పోటీ ఏర్పడడం ఖాయం. వజ్రాల వ్యాపారాల్లోకి విదేశీయులు: దేశంలో ఎక్కడైనా విక్రయించుకునే.. ప్రాసెస్ చేసుకునేందుకు అనుకూలంగా నిర్ణయం ప్రకటించారు. దీంతో ఈ రంగంపై ఆధారపడిన దేశీయ మార్కెట్ ఒడిదుడుకులకు గురి కానుంది. ఎలా చూసుకున్నా.. మేకిన్ ఇండియా విఫలమైందనేది సుస్పష్టం.

# నిధుల కొరత.. పాఠశాల నిర్వహణకు వెత



వికారాబాద్ : ప్రభుత్వ పాఠశాలల నిర్వహణకు ప్రభుత్వం ఏటా రెండుసార్లు నిర్వహణ నిధులు మంజూరు చేస్తుంది. దీనివల్ల సౌకర్యాల కల్పనకు ఇబ్బంది ఉండదు. అయితే 2024–25 విద్యా సంవత్సరం ప్రారంభమై నెల రోజులు గడిచినా పాఠశాలల నిర్వహణ కోసం ఇప్పటి వరకు నిధులు విడుదల చేయలేదు. ఏటా జులై మొదటి వారం వరకు తొలి విడత నిధులు విద్యాశాఖ విడుదల చేసేది. ఈ ఏడాది ఇప్పటి వరకు రాకపోవడంతో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సొంత డబ్బులు వెచ్చిస్తున్నారు.

**జిల్లాలో 1064 పాఠశాలలు**

జిల్లాలో 1,064 ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలున్నాయి. వీటిలో 87,888 మంది విద్యార్థులు చదువుతున్నారు. తరగతుల నిర్వహణకు చాక్‌పీసులు మొదలుకొని హాజరు దస్త్రం, డస్టర్లు, పాఠశాలకు అవసరమైన సామగ్రి, ప్రయోగశాలకు అవసరమైన రసాయనాలను పాఠశాల గ్రాంటు నుంచి కొనుగోలు చేయాలి. గత సంవత్సరం మార్చి నెలలో రెండో విడత నిధులు విడుదల చేసి ఖర్చు చేయడానికి సమయం ఇవ్వలేదని కొందరు ఉపాధ్యాయులు వాపోయారు.

**క్రీడల పైసలూ రాలేదు**

జిల్లాలో ఇటీవల పీఈటీలకు పీడీలుగా పదోన్నతి కల్పించారు. వీరు విద్యార్థులను ఆటలాడించేందుకు పలుచోట్ల క్రీడా పరికరాలు లేవు. క్రీడల నిర్వహణకు ఇంతవరకు నిధులు ఇవ్వలేదు. ఈసారి ఇస్తారా లేదా అనే సందేహాలు కూడా ఉన్నాయి. అయితే ఔత్సాహిక క్రీడాకారులను ప్రోత్సహించటానికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

**ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం– జి.రేణుకాదేవి, జిల్లా విద్యాధికారిణి, వికారాబాద్.**

ఈనెల చివర్లో లేదా వచ్చే నెలలో పాఠశాల నిర్వహణ నిధులు విడుదల చేయవచ్చు. ఈ విషయమై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతాం. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా ప్రధానోపాధ్యాయులు చొరవ తీసుకోవాలి. రెండు సంవత్సరాల నుంచి నిధుల విడుదలలో జాప్యం జరుగుతోంది.

**మొదటి విడతైనా ఇవ్వండి– కె.చంద్రశేఖర్, జిల్లా అధ్యక్షుడు పీఆర్టీయూ(టీఎస్), వికారాబాద్.**

పాఠశాల నిర్వహణ నిధులు ఏటా రెండుసార్లు విడుదల చేస్తారు. మొదటి విడత నిధులు ఇప్పటికే విడుదల చేయాల్సి ఉండేది. పాఠశాలలు ప్రారంభించి నెల రోజులైనా ఇవ్వలేదు. కనీసం అవైనా వెంటనే మంజూరు చేయాలి. చేసేదిలేక ప్రధానోపాధ్యాయులు పాఠశాలకు అవసరమైన వస్తువుల కొనుగోలుకు చేతి నుంచి పెట్టుకోవాల్సి వస్తోంది.

# నది.. సమాధి!



హైదరాబాద్: రాజధాని శివార్లలో ఈసీ నదిని కబ్జాదారులు చెరబడుతున్నారు. మట్టితో పూడ్చి విల్లాలు, అపార్టుమెంట్లు నిర్మిస్తున్నారు. పక్కనే ఉన్న రెవెన్యూ స్థలాలను కూడా కలిపేసుకుంటున్నారు. దీనికి కెదరు కిందిస్థాయి అధికారులు తోడ్పాటు అందిస్తుండగా.. మరికొందరు హెచ్‌ఎండీఏ అధికారులు ఈ అక్రమ ప్రాజెక్టులకు అనుమతులు ఇచ్చేస్తున్నారు. గండిపేట మండలం కిస్మత్‌పూర్‌లో నిర్మాణంలో ఉన్న గృహ నిర్మాణ ప్రాజెక్టును పరిశీలిస్తే భారీ అక్రమాలు జరిగినట్లు తెలుస్తోంది. రెండెకరాల ప్రభుత్వ భూమిని కలిపేసుకొని ఈసీ నదిని ఆక్రమించడానికి ప్రయత్నాలు చేశారని క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే వెలుగులోకి వచ్చింది. ఈ విషయం రెవెన్యూ అధికారులకు తెలిసినా మిన్నకుండిపోవడం చర్చనీయాంశమైంది.

**అడ్డదారుల్లో.. అక్రమంగా..** కిస్మత్‌పూర్ సమీపంలోని ఈసీ నది సమీపంలో బడా నిర్మాణ సంస్థ అపార్టుమెంట్లు, విల్లాల నిర్మాణం చేపట్టింది. నిర్మాణానికి ఆనుకొనే కిస్మత్‌పూర్ రెవెన్యూ పరిధిలోని సర్వేనంబరు 60/2లో ఉన్న రెండెకరాల ప్రభుత్వ స్థలాన్ని తన వెంచర్‌లో కలిపేసుకుంది. ఆ స్థలంలో 15 విల్లాలు, అపార్టుమెంట్ నిర్మాణం జరిగిపోతోంది. ఈసీ నదిని సైతం పూడ్చే పనులు శరవేగంగా జరుగుతున్నాయి. కిస్మత్‌పూర్–బుద్వేల్ మధ్యలో ఉన్న పాత వంతెనతోపాటు రోడ్డును సదరు సంస్థ కబ్జా చేసి అక్కడ స్వాగత కమాన్ నిర్మిస్తోంది. నదిలో భారీగా మట్టినింపే పనులు జరుగుతూనే ఉన్నాయి. కొందరు సాగునీటి శాఖ అధికారులు ముడుపులు తీసుకొని ఎన్వోసీ ఇచ్చినట్లు ఆరోపణలున్నాయి. పూర్తిస్థాయి పరిశీలన లేకుండానే హెచ్‌ఎండీఏ కూడా అనుమతులు ఇచ్చినట్లు తెలిసింది.

**టవర్‌లైన్‌ను మార్చి..** సదరు నిర్మాణ సంస్థకు సంబంధించిన స్థలంలో 220 కేవీ టవర్‌లైన్ అడ్డుగా మారడంతో ఏకంగా విద్యుత్తు సంస్థనే బురిడీకొట్టించి టవర్‌లైన్‌ను మార్పించేశారని స్థానికులు చెబుతున్నారు. ఇందుకోసం కిస్మత్‌పూర్‌కు చెందిన ఓ ఆలయ స్థలాన్ని సైతం ఆక్రమించి టవర్‌లైన్‌కు వినియోగించారని చెబుతున్నారు.

**చర్యలు తీసుకుంటాం– యాస విక్రంరెడ్డి, రెవిన్యూ అధికారి, గండిపేట మండలం**

కిస్మత్‌పూర్‌లో ప్రభుత్వ స్థలం కబ్జా విషయంపై పూర్తి పరిశీలన చేస్తాం. ఒకవేళ ఎవరైనా కబ్జా చేసినట్లు తేలితే ఉపేక్షించేది లేదు. వెంటనే ప్రభుత్వ స్థలాన్ని కొలతలు తీయించి హద్దులు ఏర్పాటు చేయిస్తాం. ఆక్రమణకు గురైన స్థలాన్ని స్వాధీనం చేసుకుంటాం.

# తేలుస్తారా.. వదిలేస్తారా..?




ఖమ్మం : ప్రభుత్వ పాఠశాలల నిర్వహణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త భాగస్వామ్యంతో వివిధ రకాల నిధులు విడుదల చేస్తారు. స్కూల్ గ్రాంట్స్ ఫండ్స్ కింద మధ్యాహ్న భోజనం, సీఎం బ్రేక్‌ఫాస్ట్, రాగిజావ, సమదుస్తులకు సంబంధించిన నిధులు మంజూరు చేస్తారు. వీటి సద్వినియోగం కోసం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలోని సమగ్రశిక్షా అభియాన్‌లో 'ఫైనాన్షియల్ అక్కౌంట్స్ ఆఫీసర్(ఎఫ్ఏఓ) ఆధ్వర్యంలో ప్రత్యేక విభాగం ఉంటుంది. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో సమగ్ర శిక్షా అభియాన్‌లో ఈ నిధులు పక్కదారి పట్టడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈనెల 6న కుంభకోణం వెలుగు చూసిన విషయం తెలిసిందే. పక్షం గడిచినా నామమాత్రపు చర్యలతోనే సరిపెడుతున్నారనే ఆరోపణలున్నాయి.

**రూ.1.82 కోట్ల దుర్వినియోగం..**

ఉభయ జిల్లాల్లో సుమారు రూ. 1.82 కోట్ల నిధుల దుర్వినియోగంలో పొరుగుసేవల ఉద్యోగి ప్రమేయముందని అధికారులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. అనంతరం ఖమ్మం త్రీటౌన్ ఠాణాలో ఫిర్యాదు చేశారు. ఖమ్మం నగరంలోని ఓ బ్యాంకులో జిల్లా విద్యాశాఖ అధికారి సంతకం ఫోర్జరీతో సదరు వ్యక్తి నెలల తరబడి రూ.లక్షలు నిధులు డ్రా చేశాడు. ఇలా పలు రకాల ఖాతాల ద్వారా డబ్బులు మళ్లించాడు. ఇప్పుడు వీటిని స్తంభింపజేశారా? లేదా అనే అనుమానాలు ఉన్నాయి.

**కొందరు అధికారుల పాత్రపై...**

సుమారు ఎనిమిది నెలల నుంచి పొరుగు సేవల ఉద్యోగి ఇంట్లో రికార్డులు ఉంటున్నట్లు తెలుస్తోంది. ఇంట్లో రికార్డులు పెట్టుకుని లావాదేవీలు నిర్వహిస్తున్నా సంబంధిత ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది. ఈ విషయంలో పలువురు ఉన్నతాధికారుల ప్రమేయంపైనా సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అకౌంటెంట్ దస్త్రాలను డీఈఓ కార్యాలయ సూపరింటెండెంట్ ద్వారా కాకుండా నేరుగా ఉన్నతాధికారులకు పంపుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. సమగ్ర శిక్షా అభియాన్‌లో జమా ఖర్చులకు సంబంధించిన వివరాలు పరిశీలించే అవకాశం లేకపోవటంతో అక్రమాలు యథేచ్ఛగా అవకతవకలు జరిగినట్లు తెలుస్తోంది. చెక్కులు, నిధులకు సంబంధించి ప్రతినెలా రీకన్సలియేషన్ తనిఖీలు లేకపోవటమూ అక్రమాలకు మరో కారణం. ప్రస్తుతం ఈ–ఆఫీస్ ఫైలింగ్ ద్వారా దస్త్రాల నిర్వహణ, ప్రత్యేకంగా పలువురు ఉద్యోగులకు లాగిన్ ఉన్నప్పటికీ లక్షల నిధులు ఎలా దారి మళ్లాయనే అంశం తేలక తలలు పట్టుకుంటున్నారు.

**కొనసాగుతున్న విచారణ–సోమశేఖరశర్మ, డీఈఓ**

సమగ్ర శిక్షా అభియాన్‌లో ఫోర్జరీ సంతకాలు, నిధుల దుర్వినియోగానికి సంబంధించిన అంశంపై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాం. ప్రస్తుతం ఈ కేసు పోలీసు విచారణలో ఉంది. అక్రమాలకు పాల్పడిన పొరుగు సేవల ఉద్యోగిని పక్కనపెట్టాం.

# మత్తు దందాలపై సాంకేతిక నిఘా

హైదరాబాద్: అంతర్జాతీయ డ్రగ్స్ మాఫియా లింకులు ఛేదిస్తున్న టీజీ న్యాబ్ మరో అడుగు ముందుకేసింది. మత్తు పదార్థాల వినియోగానికి కేంద్ర బిందువుగా మారిన విద్యాసంస్థలు, ఐటీ కంపెనీలు, పబ్‌లు, ప్రైవేటు పార్టీలపై దృష్టిసారించింది. పోలీసు యంత్రాంగం, టీజీ న్యాబ్ దృఢ నిశ్చయంతో చేపట్టిన ఆపరేషన్లలో కీలక నిందితులను గుర్తించి అరెస్ట్ చేసినట్లు తెలంగాణయాంటీ నార్కొటిక్స్ బ్యూరో(టీజీ న్యాబ్) డైరెక్టర్ సందీప్ శాండిల్య సోమవారం స్పష్టంచేశారు. రాష్ట్రవ్యాప్తంగా డ్రగ్స్ వినియోగిస్తున్న హాట్ స్పాట్స్‌పై జరిపిన వెలుగుచూసిన విషయాలను మీడియాకు వెల్లడించారు.

**పట్టుబడిన డ్రగ్స్ వినియోగదారులు**

మాదాపూర్ నోవెటాల్‌లోని అర్టిస్ట్రీ పబ్‌లో ముగ్గురు

రాయదుర్గం కేవ్ పబ్‌లో 52 మందికి వైద్యపరీక్షలు నిర్వహించగా, 33 మంది గంజాయి, కొకైన్, ఎండీఎంఏ వాడుతున్నట్లు నిర్ధారణ

ఇటీవల తనిఖీలు చేసిన విద్యాసంస్థలు, చిక్కిన విద్యార్థుల వివరాలిలా..

సింబయోసిస్ కళాశాల: 25 మంది విద్యార్థులు ఓషన్‌గ్రోన్(ఓజీ) వాడుతున్నట్లు నిర్ధారణ. తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్

ఉస్మానియా ఆసుపత్రి: ఆరుగురు జూనియర్ వైద్యులు గంజాయి తీసుకుంటున్నట్లు గుర్తింపు. వారిపై చర్యలకు ఎంసీఐకు లేఖ

గురునానక్ ఇంజినీరింగ్ కళాశాల: గంజాయి తాగుతున్న 15మంది విద్యార్థులను గుర్తించి కౌన్సెలింగ్. పునరావాస కేంద్రానికి తరలింపు

కలినరీ అకాడమీ ఆఫ్ ఇండియా (కుందన్‌బాగ్): నలుగురు విద్యార్థులు గంజాయికి అలవాటైనట్లు నిర్ధారణ. చర్యలకు విద్యాసంస్థకు సమాచారం. చైతన్యభారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (సీబీఐటీ): గంజాయితో పట్టుబడిన విద్యార్థి.

ఈ–సిగరెట్లు: వీటిని ఇండస్ స్కూల్, సీబీఐటీ విద్యార్థులకు విక్రయిస్తున్న అహ్మద్, జాఫర్ అరెస్ట్. విద్యార్థులకు కౌన్సెలింగ్.

# ఖాళీస్థలం కనిపిస్తే కబ్జా.. కాదంటే కిడ్నాప్

హైదరాబాద్: ఖాళీ స్థలం కనిపిస్తే చాలు వివరాలు సేకరిస్తారు. ఏమాత్రం వివాదంలో ఉన్నా ఆక్రమించేస్తారు. వారి సొంత సైన్యాన్ని దింపి కబ్జా చేసేస్తారు. ఇదేంటని అడిగితే చర్చల పేరిట కిడ్నాప్ చేసి చిత్రహింసలకు గురి చేస్తుంటారు. న్యాయవాద ముసుగులో అన్యాయం చేస్తున్న ఇద్దరు ప్రబుద్ధుల పాపం పండింది. ఇటీవల ఎమ్మార్పీఎస్ నేత నరేందర్, అతని స్నేహితుడు ప్రవీణ్ కిడ్నాప్, చిత్రహింసలకు ఇక్కడే గురిచేసిన విషయం విధితమే. శంషాబాద్ మున్సిపాలిటీ ధర్మగిరి సమీపంలో భూయజమానిని బెదిరించి.. ఆ స్థలాన్ని సొంతం చేసుకుని నిర్మించిన ఫాంహౌస్‌ను మున్సిపల్ కమిషనర్ బి.సుమన్‌రావు పట్టణ ప్రణాళిక విభాగం అధికారులతో కలిసి సోమవారం సాయంత్రం పొక్లెయిన్లతో నేలమట్టం చేశారు. శంషాబాద్, నార్సింగి ఏసీపీలు కె.శ్రీనివాస్, రమణగౌడ్ భారీ బందోబస్తు కల్పించారు. సర్వేనం. 103లో చార్మినార్‌కు చెందిన సక్సేనా కుటుంబానికి 200 చదరపు గజాల స్థలం, పక్కనే మరో వ్యక్తికి చెందిన



200 చ.గజాల భూమిని సుజాయత్ అలీ, ఫక్రుద్దీన్‌లు కబ్జా చేసి.. అనుమతులు లేకుండా ఫామ్‌హౌస్ నిర్మించినట్టు అధికారులు గుర్తించారు. నిందితులు పెంచుతున్న 14 శునకాలు, ఐదు గొర్రెలు, గుర్రం, 10 బాతులు, కోళ్లను నార్సింగి పోలీసులకు అప్పగించినట్లు మున్సిపల్ కమిషనర్ తెలిపారు.

**అన్యాయవాదులు..** చాంద్రాయణగుట్టకు చెందిన సుజాయత్ అలీ, నార్సింగి బృందావన్‌కాలనీకి చెందిన ఫక్రుద్దీన్ ఇద్దరూ న్యాయవాదులు. వివాదాస్పద, విదేశాల్లో ఉండే ప్రవాసుల స్థలాలను గుర్తిస్తారు. నకిలీ పత్రాలతో గంటల వ్యవధిలో ప్రహరీ నిర్మించి ఆక్రమిస్తారు. పదుల సంఖ్యలో శునకాలు.. కత్తులు, నకిలీ తుపాకీలతో అనుచరుల్ని రక్షణగా ఉంచుతారు. డీసీపీ చింతమనేని శ్రీనివాస్ బృందం ఫాంహౌస్‌లో తనిఖీలు నిర్వహించగా వీరి దారుణాలు బయటపడ్డాయి. సుజాయత్ అలీ జైలుకెళ్లగా, ఫక్రుద్దీన్ పరారీలో ఉన్నాడు. గ్యాంగ్‌సభ్యులు 16 మంది పోలీసులకు చిక్కారు.

# ఇక అవుటర్ వరకు 'స్కాడా'

తాండూరు : నగరంలో విద్యుత్తు పంపిణీ సంస్థను పర్యవేక్షించే సూపర్‌వైజరీ కంట్రోల్ అండ్ డాటా అక్వైజేషన్(స్కాడా) పరిధిని బాహ్యావలయ రహదారి వరకు విస్తరించనున్నారు. ప్రస్తుతం బల్దియాలోని 226 ఉపకేంద్రాలను స్కాడా నియంత్రిస్తుంది. మరో 112 సబ్‌స్టేషన్లను స్కాడా పరిధిలోకి తీసుకురావాలని నిర్ణయించిన డిస్కం.. సంబంధించిన సాంకేతిక పనులను త్వరితగతిన పూర్తికి చర్యలు చేపట్టింది.

తెలంగాణ ఏర్పాటు అనంతరం నగరంలో కొత్తగా 33/11కేవీ ఉపకేంద్రాలు వచ్చాయి. 11కేవీ ఫీడర్ల సంఖ్య కూడా పెరిగింది. ప్రధాన నగరంలోని సబ్‌స్టేషన్లు, వాటి పరిధిలోని 11కేవీ ఫీడర్లని ఎర్రగడ్డ కల్యాణ్‌నగర్‌లోని స్కాడా పరిధిలోకి తీసుకొచ్చారు. ఏపీడీఆర్‌పీ పథకం కింద ఆధునాతన



కంప్యూటర్లు, సాఫ్ట్‌వేర్, సెన్సర్లు, పరికరాల కొనుగోలుకు భారీగా నిధులు సైతం అందాయి. స్కాడా రాకతో కార్యాలయం నుంచే ఇంజినీర్లు ఎక్కడైనా బ్రేక్‌డౌన్ అయితే ఆ సమాచారం ఎప్పటికప్పుడు తెలుసుకునే వెలుసుబాటు ఏర్పడింది. దీంతో సిబ్బంది, ఇంజినీర్లు అప్రమత్తమయ్యేవారు. చాలాకాలంగా స్కాడా వ్యవస్థను ఆధునికీకరించకుండా వదిలేశారు. కొన్ని ఎన్నో పరికరాలను చాలాకాలం పాటూ మూలనపడేశారు. ఆ తర్వాత శివార్లలోని ఉపకేంద్రాలను స్కాడా పరిధిలోకి తీసుకురావాలని ప్రణాళికలు వేసినా ఆచరణలోకి రాలేదు.

**రూ.25కోట్ల అంచనా..** స్కాడా వ్యవస్థను 116 ఉపకేంద్రాల్లోని 200 ఫీడర్లలో రూ.25కోట్ల అంచనా వ్యయంతో ప్రవేశపెట్టబోతున్నారు. దీంతో అవుటర్ వరకు విస్తరించినట్లు అవుతుందని ఒక అధికారి తెలిపారు. మిగిలిన సబ్‌స్టేషన్లను తదుపరి దశలో చేపట్టనున్నారు.

# పేదల అభివృద్ధికి పెద్ద పీటవేసిన బడ్జెట్

## ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ భోజ్జు పటేల్



**ఉట్నూర్ జులై 25(ప్రభాత సమాచారం )**
సంక్షేమం అభివృద్ధి లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం తొలిసారి పూర్తిస్థాయి ప్రవేశపెట్టిన బడ్జెట్ ఎస్సీ ఎస్టీ బడుగు వర్గాల,మైనారిటీల సంక్షేమానికి పెద్దపీట వేసిందని, రైతులు వ్యవసాయ రంగంలో నిలదొక్కుకొనే విధంగా రూపొందించిన ప్రజా ఆమోదయోగ్యంగా ఉందని ఖానాపూర్ శాసనసభ్యులు వెడ్మ భోజ్జు పటేల్ అన్నారు. రూ.2,91,159 కోట్లతో రాష్ట్ర పూర్తిస్థాయి బడ్జెట్ను శాసనసభలో ఆర్థికశాఖ మంత్రి భట్టి విక్రమార్క ప్రవేశపెట్టారని అన్నారు. బడ్జెట్ కేటాయింపులు పేద ప్రజల జీవనప్రమాణల్లో మార్పులు తీసుకుస్తుందని అన్నారు. రుణ మాఫీ, రైతు భరోసా, రైతు భీమాకు కేటాయించిన నిధులు రైతుల్లో ఆనందాన్ని నింపిందన్నారు.పూటగడవని నిరుపేదలకు గూడును సమకూర్చడం ప్రభుత్వం కర్తవ్యంగా భావించి ఇందిరమ్మ ఇండ్లు అనే పథకం నూతన గృహ నిర్మాణ కార్యక్రమాన్ని చేపట్టింది. ఇళ్లు కట్టుకోడానికి పేదలకు రూ.5లక్షల ఆర్థిక సహాయం చేస్తుంది. ఎస్టీ, ఎస్సీ లబ్ధిదారులకు రూ.6లక్షల సహాయం అందించనుందని దీంతో గ్రామాల్లోకి పేదల స్వంత ఇంటి కల నెరవేరుతుందన్నారు. సాగునీటి రంగానికి బడ్జెట్ లో ప్రత్యేక కేటాయింపులు చేసి వాస్తవ బడ్జెట్ రూపొందించరన్నారు.గత ప్రభుత్వం బడ్జెట్లో సాగునీటి రంగంలో కాళేశ్వరం ప్రాజెక్ట్ పేర ఇష్టారితిన నిధులు దుర్వినియోగం చేసారని ఆయన ఆరోపించారు. బడ్జెట్ లో నియోజకవర్గం లోని కడెం ప్రాజెక్టు అభివృద్ధికి రూ. తొమ్మిదిన్నర కోట్లు కేటాయించారని ఎమ్మెల్యే తెలిపారు. నాగోబా జాతర నిర్వహణకు రూ. కోటి, సేవాలాల్ జయంతి నిర్వహణకు రూ. రెండు కోట్లు, మేడారం జాతరకు వంద కోట్లు బడ్జెట్లో కేటాయించారన్నారు.సంక్షేమానికి రూ. 40 వేల కోట్లు,సాగునీటి పారుదల శాఖకు రూ.26 వేల కోట్లు,వ్యవసాయం, అనుబంధ రంగాలకు రూ.72,659 కోట్లు,గృహజ్యోతి పథకానికి రూ.2418 కోట్లు,మహాలక్ష్మి ఉచిత రవాణాకు రూ.723 కోట్లు కేటాయించడం హర్షనియమన్నారు.ఎస్టీ సంక్షేమానికి రూ.17,000 కోట్లు,ఎస్సీ సంక్షేమానికి రూ. 33024 కోట్లు,మైనారిటీ సంక్షేమానికి రూ.3,000 కోట్లు, %శ్రీ% మైనారిటీ సంక్షేమం రూ.3,000బీసీ సంక్షేమనికి రూ. 9,200 కోట్లుకేటాయింపులు జరిగాయన్నారు.గత ప్రభుత్వం బడ్జెట్ కంటే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రభుత్వం బడ్జెట్ అభివృద్ధి, సంక్షేమం ప్రాతిపదికన రూపొందించ%శీ%దని అన్నారు. మారు మూల గ్రామాలకు రవాణా సాకర్యం కల్పించేందుకు బడ్జెట్లో ప్రాధన్యత ఇచ్చారన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి ఉన్నతమైన బడ్జెట్ ప్రవేశపెట్టినందుకు సీఎం రేవంత్ రెడ్డి, ఆర్థిక మంత్రి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కలకు వెడ్మ భోజ్జు పటేల్ ధన్యవాదాలు తెలిపారు.

# ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు మెరుగైన విద్యనందించండి

## ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి కుష్బు గుప్తా





**బేల జులై 25(ప్రభాత సమాచారం)**
ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలని ఐటిడిఎ పిఓ కుష్బు గుప్తా ఉపాధ్యాయులను ఆదేశించారు. బేలా (బి) ఆశ్రమ ఉన్నత పాఠశాలను ఆమె ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థులకు అందిస్తున్న విద్య, భోజనంపై అధికారులను అడిగి తెలుసుకొన్నారు.ఉపాధ్యాయుల అటెండెన్స్, స్టాక్ రిజిస్టార్లను పరిశీలించారు.ఈ సందర్భంగా పిఓ మాట్లాడుతూ, విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ప్రతిరోజూ మెనూ ప్రకారం పోషక విలువలు గల ఆహారాన్ని అందించాలన్నారు సూచించారు. సబ్జెక్టుల వారీగా విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలనీ అన్నారు. నిత్యం పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ప్రతిరోజు వంటగది, స్టోర్ రూమ్, తాగునీరు, మరుగుదొడ్లు శుభ్రంగా ఉండేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం తరగతి గదిలో విద్యార్థులకు పాఠాలు భోదించారు. సబ్జెక్టుల వారీగా ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు.ప్రతి విద్యార్థికి చదవడం, రాయడం తప్పనిసరిగా రావాలని ఉపాధ్యాయులకు సూచించారు. జ్యోతి, సుమిత్ర, లక్ష్మణ్ దిలీప్ వాలా సెలవులను రిజిస్టర్లు నమోదు చేయనందున ఇంచార్జ్ హెచ్ఎం అయినా జి శ్వేతకు షోకాజు నోటీసు జారీ చేశారు . గత ఐదు రోజుల నుండి ఎలాంటి సమాచారం లేకుండా విధులకు గైహార్జు అయినందుకు దశరథ్ అనే ఉపాధ్యాయునికి షోకాజు నోటీసు ఇచ్చారు. అలాగే అక్కడే పనిచేస్తున్న శంభు అనే వర్కర్ తన స్థానంలో వేరే వాళ్ళతో పని చేయించడం పై ఆగ్రహించారు. ఇప్పటి నుంచి ఎవరి ఉద్యోగం వారి చేయాలి కాంట్రాక్ట్ ఉద్యోగాలను పెట్టకుండా తగిన చర్యలు తీసుకోవాలని అక్కడ ఏటిడిఓకు ఆదేశించారు. లేకుంటే కఠిన చర్యలు తీసుకుంటానని సూచించారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో సకాలంలో ఔషధాల రిజిస్టరును సక్రమంగా నిర్వహించనందున మెడికల్ ఆఫీసర్ కు షోకాజు నోటీసు జారీ చేశారు. వర్షాల నేపథ్యంలో దోమల వలన వ్యాపించే డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా, వసతి గృహ పరిసరాలలో వర్షపు నీరు నిలువకుండా చూడాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు.

# అర్లీ (టి) లో పర్యటించిన కలెక్టర్

## మొక్కలు నాటి గ్రామస్తులతో సమావేశం

## పాఠశాలను సందర్శించి విద్యా బోధన తీరును పరిశీలించిన కలెక్టర్









**ఆదిలాబాద్ జులై 25(ప్రభాత సమాచారం)**
భీమ్ పూర్ మండలం లోని పత్తి చేనులో పంటల నమోదు ప్రక్రియ, జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల, అర్లీ టి జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో ఏర్పాటు చేసిన వన మహోత్సవం కార్యక్రమంలో మొక్కలు నాటి, పదవ తరగతి విద్యార్థులతో ముచ్చటించి ఆర్లీ టి గ్రామ అభివృద్ధి కమిటి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వన మహోత్సవం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జిల్లా పాలనాధికారి రాజర్షి షా పాల్గొని గ్రామ పెద్దలు సమస్యలను విని మాట్లాడుతూ భీంపూర్ రోడ్డు కు సంబంధించి రోడ్డు పనులకు శాంక్షన్ ఇవ్వడం జరిగిందని, తొందరగా మొదలు పెట్టాలని అధికారులను ఆదేశించామని, గ్రంథాలయంలో బుక్స్ ఏర్పాట్లు చేయడం జరుగుతుందని అన్నారు.ఐటిఐ స్టార్ట్ అయిన తర్వాత భీంపూర్ మండలంలో ప్రత్యేకంగా ఐటిఐ గురించి చాలామంది యూత్ కి ప్రోత్సాహించి ట్రైనింగ్ ఇవ్వగలిగితే మంచి ప్యాకేజీ ఉపాధి రావడానికి ఆస్కారం ఉంటుందని అన్నారు. ప్రభుత్వ స్కూల్ కాలేజ్ ఏవైతే ఉన్నాయో అక్కడ విద్యాబోధన అందించాలన్నది ప్రభుత్వ లక్ష్యం కాగా, ప్రభుత్వం మంచి విద్య అందిస్తుంది కాబట్టి అందరూ మంచిగా చదువుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు.పదవ తరగతి విద్యార్థులతో ముచ్చటిస్తూ బాగా చదువుకోవాలని చదువుతోనే మంచి భవిష్యత్ ఉందని, పదిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించి జిల్లాకు మంచి పేరు తేవాలని ఆన్నారు. అంతకుముందు భీమ్ పూర్ లో పత్తి చేను పంటల నమోదు ప్రక్రియను పరిశీలించి రెట్కతులు పంటలను నమోదు చేసుకోవాలని తెలిపారు. తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ను ఆకస్మికంగా తనిఖీ చేసి రుణమాఫీ ప్రక్రియను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సత్యనారాయణ, డిఎఓ పుల్లయ్య, ఎఓ రవీందర్, ఎ ఈ శంకర్, రెట్కతులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

# భద్రాచలం ఐటిడిఏ ఎపిఓ పెందూర్ భీమ్ మృతి



**ఉట్నూర్ జులై 25(ప్రభాత సమాచారం)** భద్రాచలం ఐటిడిఎ ఎపిఓ పెం దూర్ భీమ్ అనారోగ్యంతో చికిత్స పొందుతు గురువారం హైదరా బాద్ లో మృతి చెందారు. ఆదిలా బాద్ జిల్లా ఉట్నూర్ ఐటిడిఎ లో ఆయన వివిధ హొదాల్లో పనిచేసారు. ఇక్కడి నుంచి భద్రాచలంకు బదిలీ అయిన అయన గత కొంత కాలంగా అనారోగ్యం తో బాధ పడుతున్నారు.

ఆయన పరిస్థితి విషమించ డంతో కుటుంబ సభ్యులు చికిత్స కోసం హైదరాబాద్ తరలించారు. చికిత్స పొందుతు తుది శ్వాస విడిచారు.అయన నిర్మల్ జిల్లా దాస్తురాబాద్ మండలం మల్లాపూర్ వాస్తవ్వులు. ఆయన అంత్యక్రియలు శుక్రవారం మల్లపూర్ లో నిర్వహించనున్నారు. **సంతాపం** పెందూర్ భీమ్ మృతి పట్ల ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ భోజ్జు పటేల్ విచారం వ్యక్తం చేసారు. ఆయన మృతిపట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేసారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేసారు.




హైదరాబాద్: రాజధాని హైదరాబాద్ సహా తెలంగాణ వ్యాప్తంగా పేట్రేగిపోతున్న గంజాయి, మాదకద్రవ్యాల వినియోగంపై తెలంగాణ ప్రభుత్వం ఉక్కుపాదం మోపింది. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి డ్రగ్స్ నియంత్రణకు కఠిన చర్యలు తీసుకుంటున్న సీఎం రేవంత్ రెడ్డి.. ఇటీవల సినీ పరిశ్రమకు కూడా కీలక సూచనలు సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే తాజా బడ్జెట్‌లోనూ దీన్ని ప్రధానంగా ప్రస్తావించారు. యువశక్తిని నిర్వీర్యం చేస్తున్న మాదకద్రవ్యాల కట్టడి, శాంతి భద్రతల కోసం హోం శాఖకు బడ్జెట్‌లో రూ.9,564 కోట్లు కేటాయించింది. తెలంగాణ అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క గురువారం రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. “మాదక ద్రవ్యాల వినియోగం చాలా ప్రమాదకరం. యువత దీని బారినపడితే దేశ భవిష్యత్తే ప్రశ్నార్థకంగా మారుతుంది. రాష్ట్ర ప్రజలను, ముఖ్యంగా విద్యార్థులను ఈ మహమ్మారి బారి నుంచి కాపాడేందుకు వివిధ చర్యలు తీసుకుంటున్నాం. డ్రగ్స్ రవాణా, వినియోగం చేస్తూ పట్టుబడితే వారిని ఉపేక్షించొద్దని అధికారులకు స్పష్టమైన ఆదేశాలిచ్చాం. తెలంగాణ మాదకద్రవ్య నిరోధక సంస్థకు తగిన సౌకర్యాలు కల్పించి దాన్ని బలోపేతం చేశాం. విద్యాసంస్థల్లో వీటి కట్టడికి యాంటీ డ్రగ్ కమిటీలు ఏర్పాటు చేసి.. 4,137 మంది విద్యార్థులను యాంటీ డ్రగ్ సోల్జర్స్‌గా నియమించాం. మాదకద్రవ్యాల వల్ల జరిగే హానిపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు సినీ ప్రముఖుల సహకారం తీసుకుంటున్నాం. వీటికి సంబంధించిన కేసుల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తాం. తెలంగాణను మాదకద్రవ్య రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని హామీ ఇస్తున్నాం” అని ఆర్థిక మంత్రి బడ్జెట్ ప్రసంగంలో వెల్లడించారు.

**సైబర్ నేరాలపై నిఘా..** మరోవైపు నానాటికీ పెరుగుతున్న సైబర్ నేరాలపైనా తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఈ విషయాన్ని కూడా మంత్రి భట్టి బడ్జెట్ ప్రసంగంలో ప్రస్తావించారు. “రాష్ట్రాభివృద్ధికి శాంతి భద్రతల పరిరక్షణ ఎంతో అవసరం. అభద్రతా వాతావరణంలో పెట్టుబడి పెట్టడానికి అంతర్జాతీయ సంస్థలు ఆసక్తి చూపించవు. ఈ మధ్య వైట్ కాలర్, సైబర్ నేరాలు పోలీసు వ్యవస్థకు సవాల్‌గా మారుతున్నాయి. ఇలాంటి నేరాలను అరికట్టేందుకు సైబర్ సెక్యూరిటీ విభాగానికి అవసరమైన వాహనాలు అందించాం. ఆధునిక నేర పరిశోధనలో పోలీసులకు శిక్షణ ఇస్తున్నాం. రాష్ట్రవ్యాప్తంగా అన్ని పోలీసు స్టేషన్లలో సైబర్ క్రైమ్ ఫిర్యాదులను నమోదు చేసే అవకాశం కల్పించాం. ఆన్‌లైన్‌లోనూ ఫిర్యాదులు చేసేలా వెబ్‌సైట్, టోల్‌ఫ్రీ నంబరుపై విస్తృత ప్రచారం చేస్తున్నాం. కేంద్రం తీసుకొచ్చిన కొత్త నేర చట్టాలపై పోలీసు సిబ్బందికి అవగాహన కల్పించేలా శిక్షణా తరగతులు నిర్వహించాం” అని మంత్రి భట్టి వివరించారు.

# ఉపాధి హామీ పనుల్లో అక్రమాలు 24 మందికి షోకాజు నోటీసులు

**సిర్పూర్(టి), జూలై 25 (ప్రభాత సమాచారం)** మండలకేంద్రంలోని రైతు వేదికలో గురువారం జాతీయ ఉపాధిహామీ పథకంలో 2023-24సంవత్సరంలో చేపట్టిన 386 పనులకు సంబంధించిన రూ.2,86,79,048 లకు గాను గ్రామీణఉపాధిహామీ సిబ్బందితో సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఇందులో 23 మంది ఫీల్డ్అసిస్టెంట్, టెక్నికల్అసిస్టెంట్లు, కార్యద ర్శులకు షోకాజు నోటీసు లు జారీచేయగా, ఒకఫీల్డ్ అసిస్టెంట్‌పై విచారణ, రెండుపనులకు క్వాలిటీ కంట్రోల్ అధికారులతో తనిఖీచేపట్టాలని, రూ.42,50జరిమానా విదించామని డీఆర్డీవో పీడీసురేందర్ తెలిపారు. ఎంతటి వారైనా అవకతవక లకు పాల్పడితే వారిపై చర్యలు తీసుకుం టామన్నారు. షోకాజు నోటీసులు అందకున్న వారుతప్పనిసరిగా సమాధానం ఇవ్వా లని, రివకరీడబ్బులు కట్టాలని ఆదేశించారు.

కూలీ లకు రూ.2,67,05,875 చెల్లించగా ఇందులో రూ.19,73,170మెటీరియల్‌కు వాడారన్నారు. సిర్పూ ర్(టి)మండలంలో రూ.2,86,79,048 పనులు చేపట్టారన్నారు. ఈ నివేదిక ఉన్నతాధికారులకు సమర్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సత్యనారాయణ, గత ఎంపీడీ వో రాజేశ్వర్, ఏపీఎం చంద్రయ్య, ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్, కార్యదర్శులు, సామాజిక తనిఖీ బృందం సభ్యులు పాల్గొన్నారు.



# రైతులకు గుడ్‌న్యూస్.. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి బడ్జెట్‌లో భారీ కేటాయింపులు..

తెలంగాణ 2024-25 వార్షిక బడ్జెట్‌ను రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి భట్టి విక్రమార్క శాసనసభలో ప్రవేశపెట్టారు. పేద ప్రజల జీవన ప్రమాణాలు పెంచడమే తమ ప్రభుత్వ లక్ష్యమని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. గత ప్రభుత్వ చర్యల కారణంగా రాష్ట్రం ఎంతో నష్టపోయిందని చెప్పారు. అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా తమ ప్రభుత్వం ముందుకెళ్తోందని చెప్పారు. గత ప్రభుత్వ నిర్ణయాలతో తెలంగాణ రైతాంగం ఎంతో నష్టపోయిందని.. రైతు సాధికారత దిశగా తమ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. తెలంగాణ సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు. తమది మాటల ప్రభుత్వం కాదని.. చేతల ప్రభుత్వమని తక్కువ కాలంలోనే నిరూపించామని భట్టి విక్రమార్క తన ప్రసంగంలో తెలిపారు. వివిధ రంగాలకు కేటాయింపులను ఆయన సభలో వివరించారు. మొత్తంగా రూ.2, 91, 191 కోట్లతో బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్నట్లు తెలిపారు.

**రైతులకు గుడ్ న్యూస్..** తెలంగాణ ప్రభుత్వం బడ్జెట్‌లో రైతులకు గుడ్ న్యూస్ చెప్పింది. ఉద్యానవన పంటలకు ప్రోత్సహం ఇవ్వనున్నట్లు ప్రకటించింది. హార్టికల్చర్ కోసం ఈ బడ్జెట్‌లో రూ.737 కోట్లను ప్రతిపాదిస్తున్నట్లు ఆర్థిక మంత్రి భట్టివిక్రమార్క తెలిపారు. గత ప్రభుత్వ పాలనలో నకిలీ విత్తనాల కారణంగా రైతాంగం నష్టపోయిందని.. తమ ప్రభుత్వం నకిలీ విత్తనాలను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటుందని భట్టి విక్రమార్క సభలో ప్రకటించారు. నాణ్యమైన విత్తనాలను రైతులకు అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకున్నామని చెప్పారు. రైతుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. వ్యవసాయానికి సాంకేతికతను జోడించేందుకు ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. సన్నవడ్లు పండించే రైతులకు క్వింటాలకు రూ.500 బోనస్ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు. శాస్త్రీయ పద్ధతుల ద్వారా రైతు దిగుబడిని పెంచుకునేందుకు వీలుగా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందన్నారు. టెక్నాలజీని వ్యవసాయానికి అనుసంధానిచడం తమ ప్రభుత్వ ప్రాధాన్యతగా పెట్టుకున్నామని భట్టి విక్రమార్క తెలిపారు.

**ఇందిరమ్మ ఇళ్లు..** గత బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్రూం ఇళ్ల పేరుతో పేద ప్రజలను మోసం చేసిందని ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. పూటగడవని నిరుపేదలకు గూడు సమకూర్చడం ప్రభుత్వ కర్తవ్యమని ఆయన పేర్కొన్నారు. గత ప్రభుత్వం నిరుపేదలకు ఎన్నో ఆశలు కల్పించి.. ఇళ్లు కేటాయించకుండా దగా చేసిందన్నారు. పేద ప్రజల సొంతింటి కళను నెరవేర్చేందుకు ఇందిరమ్మ ఇళ్లు పథకాన్ని ప్రారంభించామన్నారు. పేద ప్రజలు ఇళ్లు కట్టుకోవడానికి రూ.5లక్షల ఆర్థిక సాయం అందించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఎస్సీ, ఎస్టీలకు రూ.6లక్షల సాయం అందించాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ప్రతి నియోజకవర్గంలో 3,500 ఇళ్ల చొప్పున మొత్తం రాష్ట్రంలో 4లక్షల 50 వేల గృహాల నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని భట్టి విక్రమార్క తెలిపారు.




## గేమ్ స్టార్ట్.. కేసీఆర్‌కు మంత్రులు, ఎమ్మెల్యేలు స్ట్రాంగ్ కౌంటర్..

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై బీఆర్ఎస్ అధినేత, విపక్ష నేత కేసీఆర్ చేసిన కామెంట్స్‌కు కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేలు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. అసెంబ్లీ మీడియా పాయింట్‌లో మాట్లాడిన మంత్రులు, ఎమ్మెల్యేలు.. కేసీఆర్ వ్యాఖ్యలపై విమర్శలు గుప్పించారు. కేంద్ర బడ్జెట్‌పై స్పందించని కేసీఆర్.. రాష్ట్ర బడ్జెట్ మీద మాట్లాడటం విడ్డూరంగా ఉందని మంత్రి సీతక్క విమర్శించారు. తెలంగాణకు ద్రోహం చేసన కేంద్ర బడ్జెట్‌ను నిరసిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేస్తే కేసీఆర్ ఎందుకు రాలేదు? అని ప్రశ్నించారు. కేంద్ర బడ్జెట్‌పై మాట్లాడని కేసీఆర్.. రాష్ట్ర బడ్జెట్‌ను విమర్శించడం ఆశ్చర్యంగా ఉందన్నారు. ఇది ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నామని సీతక్క అన్నారు. బీజేపీతో ఒప్పందంలో భాగంగానే అసెంబ్లీకి వచ్చిన మొదటి రోజే రాష్ట్ర ప్రభుత్వాన్ని కేసీఆర్ టార్గెట్ చేస్తున్నారని విమర్శించారు మంత్రి సీతక్క. బీజేపీ మెప్పు కోసమే కేసీఆర్ రాష్ట్ర బడ్జెట్‌పై విమర్శలు చేస్తున్నారన్నారు. 6 నెలల తరువాత అసెంబ్లీ సమావేశాలకు రావడమే ఇందుకు నిదర్శనం అన్నారు.

**అచ్చంపేట కాంగ్రెస్ ఎమ్మెల్యే వంశీ కృష్ణ..** 'ఎన్నడూ లేని విధంగా ఈ రోజు కేసీఆర్ మీడియా పాయింట్‌కి వచ్చారు. తొందర్లోనే కోర్టు బోన్‌లోకి వస్తారు. కేసీఆర్ ఊహల్లో బతికారు. ఇంకా నేనే రాజు అనుకుంటున్నారు. మీరు పెట్టిన బడ్జెట్ ఎవరికి ఉపయోగపడలేదు. నీళ్ళు, నిధులు, నియామకాల కోసమే తెలంగాణ తెచ్చుకుంది. కానీ గత ప్రభుత్వం నీళ్ళు ఇవ్వలేదు.. నిధులూ ఇవ్వలేదు.. ఇంక నియామకాల ఉసే అస్సల్ లేదు. అప్పులు చేసి తెలంగాణ ప్రజల జీవితాలపై వేశారు.' అని ఎమ్మెల్యే వంశీ కృష్ణ ఫైర్ అయ్యారు.

**నారాయణఖేడ్ కాంగ్రెస్ ఎమ్మెల్యే సంజీవ రెడ్డి..** 'వాస్తవానికి బడ్జెట్ దగ్గర ఉంది. అందుకే ప్రతిపక్షానికి మింగుడు పడటం లేదు. కాళేశ్వరం ప్రాజెక్టు గంగలో కలిపారు. లక్ష రూపాయల రుణమాఫీ ఇప్పటికే చేసిన ఘనత రేవంత్ రెడ్డికి దక్కింది. ఇప్పటికి పెండింగ్ బిల్లులు రావడం లేదు.' అని అన్నారు.

**కాంగ్రెస్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ..** 'గత ప్రభుత్వం మాదిరి అంకెల రూపంలో బడ్జెట్ పెట్టకుండా.. అన్ని శాఖలకు బడ్జెట్ కేటాయించాము. వాస్తవిక బడ్జెట్ ప్రవేశపెట్టడం జరిగింది. ఒక్కో రంగానికి ఎన్ని డబ్బులు కేటాయిస్తున్నం అనేది విపులంగా వివరించారు. సంక్షేమం, అభివృద్ధి రెండు జరగాలని కేటాయింపులు చేయడం జరిగింది. గత బడ్జెట్‌లో కన్నా వైద్య విద్య కోసం ఎక్కువ కేటాయింపులు చేశారు. రూ. 9 వేల కోట్లు పైచిలుకు బడ్జెట్ పెట్టి.. వైద్య విద్యకు పూర్వ వైభవం తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తుంది. బడ్జెట్‌ను తులనాడే విధంగా కేసీఆర్ మాట్లాడారు. గత బడ్జెట్ పెపర్లకు పరిమితం అయ్యింది. కేసీఆర్ ఇంకా ఊహల్లో ఉండకుండా.. బడ్జెట్‌ను ఆహ్వానించాలి.' అని అన్నారు.

**కాంగ్రెస్ ఎమ్మెల్యే మధన్ మోహన్ రావు..** 'రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రజా సంక్షేమం బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం జరిగింది. ఇది రైతు బడ్జెట్. తెలంగాణ వచ్చిన పదేళ్లలో నీటిపారుదల ప్రాజెక్టులు అని డబ్బులు తగలేశారు. గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు.. త్రాగు నీటి సదుపాయాలు లేవు. స్కూల్స్‌లో టీచర్స్ లేరు. వైద్య, విద్య రంగాలకు నిధులు కేటాయింపు చేయడం జరిగింది.

జాబ్ క్యాలెండర్ కూడా పెట్టడం జరిగింది. సెప్టెంబర్ 5, 6 లోగా గ్లోబల్ మేథోసంపత్తి కోసం స్కిల్ యునివర్సిటీ పెట్టే విధంగా ఏర్పాటు చేస్తున్నాం. గత ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టుకు లక్షల కోట్లు తగల వేశారు. కానీ, ఇప్పుడు అన్ని రంగాలకు, సంక్షేమానికి బడ్జెట్‌లో నిధులు పెట్టారు.' అని అన్నారు.




హైదరాబాద్: విశ్వనగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలంగాణ ఆర్థికశాఖ మంత్రి భట్టి విక్రమార్క అన్నారు. 2024-25 సంవత్సరానికి సంబంధించిన రాష్ట్ర బడ్జెట్‌ను గురువారం ఆయన అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. హైదరాబాద్ నగర అభివృద్ధికి భారీగా రూ. 10వేల కోట్లు కేటాయించారు. శంషాబాద్ విమానాశ్రయం వరకు మెట్రో విస్తరణకు రూ. 100 కోట్లు, మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు రూ. 1500 కోట్లు, ఆర్ఆర్ఆర్ ప్రాజెక్టు రూ. 1,525 కోట్లు, పాతబస్తీ మెట్రో విస్తరణకు రూ. 500 కోట్లు, ఔటర్ రింగ్ రోడ్డుకు రూ. 200 కోట్లు, హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్టుకు రూ. 500 కోట్లు, మెట్రో వాటర్ వర్క్స్ రూ. 3,385 కోట్లు, హైడ్రా సంస్థకు రూ. 200 కోట్లు కేటాయించారు. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న చారిత్రాత్మక నగరం హైదరాబాద్‌ను మరింత ప్రణాళికాబద్ధంగా తీర్చిదిద్దేందుకు కట్టుబడి ఉన్నాం. హైదరాబాద్‌లో ఉద్యోగ, ఉపాధి పొందుతున్నవారికి కార్యాలయాలకు దగ్గరగా, శాటిలైట్ టౌన్‌షిప్‌ల నిర్మాణాన్ని నగరం చుట్టూ ప్రోత్సహిస్తాం. ఈ టౌన్‌షిప్ లలో సరసమైన ధరల్లో పేద, మధ్యతరగతి వారికి అనుకూలమైన నివాసగృహాల నిర్మాణాలను అందించేలా కృషి చేస్తాం. ప్రస్తుతం మూడు ట్రాఫిక్ కారిడార్లలో మెట్రో సౌకర్యం ఉంది. వివిధ వర్గాల అవసరాలను తీర్చడంతో పాటు నగరంలో అన్ని ప్రాంతాలు సమానంగా అభివృద్ధి చెందాలన్న లక్ష్యంతో, ప్రభుత్వం 78.4 కి.మీ. పొడవున్న 5 అదనపు కారిడార్లను రూ. 24,042 కోట్లతో అభివృద్ధి పరుస్తుంది. ఇందులోభాగంగా మెట్రో రైలును పాతనగరానికి పొడిగించి దానిని శంషాబాద్ విమానాశ్రయానికి అనుసంధానం చేస్తాం. ప్రస్తుతమున్న కారిడార్లను నాగోలు నుంచి ఎల్.బి.నగర్ వరకు విస్తరిస్తాం. నాగోలు, ఎల్.బి నగర్, చంద్రాయణగుట్ట స్టేషన్లను ఇంటర్ ఛేంజ్ స్టేషన్లగా అభివృద్ధి చేస్తాం. మియాపూర్ నుంచి పటాన్ చెరువుకు, ఎల్.బి.నగర్ నుంచి హయత్ నగర్ వరకు మెట్రో రైలు సౌకర్యాన్ని పొడిగించాలని కూడా ప్రణాళిక సిద్ధం చేశాం. హైదరాబాద్, ఔటర్ రింగ్ రోడ్డు వరకు గల ప్రాంతాలను కోర్ అర్బన్ రీజియన్‌గా గుర్తించి వాటి అభివృద్ధికి ప్రత్యేకంగా ప్రణాళికలు రూపొందిస్తాం. ఔటర్ రింగు రోడ్డును నగర సరిహద్దుగా పరిగణిస్తాం. ఓఆర్ఆర్ పరిధిలో విపత్తుల నిర్వహణకు ఒక ఏకీకృత సంస్థ ఏర్పాటు. జీహెచ్ఎంసీ సహా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజ్‌గిరి, సంగారెడ్డి జిల్లాలు దీని పరిధిలోకి వస్తాయి. పట్టణ విపత్తులను నివారించడానికి, వాటిని ఎదుర్కొనడానికి తీసుకోవాల్సిన చర్యలను చేపట్టడంతో పాటు, ఎటువంటి విపత్కర పరిస్థితినైనా ఎదుర్కొని తక్షణ రక్షణ చర్యలు తీసుకొనే విషయంలో జాతీయ, రాష్ట్రేతర సంస్థలతో సమన్వయం. ఈ వ్యవహారాలను పర్యవేక్షించే బాధ్యత హైదరాబాద్ విపత్తు నివారణ, ఆస్తుల పరిరక్షణ సంస్థ చేస్తుంది. ఈ సంస్థలో ఆస్తుల పరిరక్షణకు, విపత్తుల నిర్వహణకు ప్రత్యేక విభాగాలు. మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులో భాగంగా సుమారు 110 చదరపు కి.మీ. పట్టణ ప్రాంతం పునరుజ్జీవనం. నదీ తీర ప్రాంతంలో కొత్త వాణిజ్య, నివాస కేంద్రాలు, పాత హెరిటేజ్ ప్రాంతాలకు కొత్త సొబగులు. మూసీ నదీ పరివాహక ప్రాంత అభివృద్ధి ప్రాజెక్టులో రిక్రియేషన్ జోన్‌లు, పాదచారుల జోన్‌లు, పీపుల్స్ ప్లాజాలు, చిల్డ్రన్స్ థీమ్ పార్కులు, ఎంటర్‌టైన్‌మెంట్ జోన్‌ల అభివృద్ధి. లండన్ నగరంలో ఉన్న థేమ్స్ నదీ పరివాహక అభివృద్ధి తరహాలో మూవీ అభివృద్ధి. హైదరాబాద్ నగరాభివృద్ధి, మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు రూ. 1,500 కోట్లు ప్రతిపాదన. హైదరాబాద్ నగర ప్రాధాన్యం దృష్ట్యా నగరాభివృద్ధికి మరింత పెద్దపీట. GHMC, HMDA, సేవలను ప్రజలకు మరింత మెరుగ్గా అందించేందుకు GHMC పరిధిలో మౌలిక వసతుల కల్పనకు రూ. 3,065 కోట్లు. HMDA పరిధిలో మౌలిక వసతుల కల్పనకు రూ. 500 కోట్లు. మెట్రో వాటర్ వర్క్స్‌కి రూ. 3,385 కోట్లు ప్రతిపాదన. హైడ్రాకి రూ. 200 కోట్లు ఎయిర్‌పోర్టు వరకు మెట్రో విస్తరణకు రూ. 100 కోట్లు, ఔటర్ రింగ్ రోడ్డు కోసం రూ. 200 కోట్లు, హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టుకి రూ. 500 కోట్లు, పాత నగరానికి మెట్రో విస్తరణకి రూ. 500 కోట్లు, మల్టీ మోడల్ సబర్బన్ రైలు ట్రాన్స్‌పోర్టు సిస్టమ్ కోసం రూ. 50 కోట్లు. రీజనల్ రింగ్ రోడ్‌తో అభివృద్ధి మరింత వేగవంతం. ఉత్తర ప్రాంతంలోని 158.6 కి.మీ. పొడవున్న సంగారెడ్డి- తూప్రాన్ - గజ్వేల్ - చౌటుప్పల్ రోడ్డును, దక్షిణ ప్రాంతంలోని 189 కి.మీ.ల పొడవున్న చౌటుప్పల్ -షాద్ నగర్-సంగారెడ్డి రోడ్డును, జాతీయరహదారులుగా ప్రకటించడానికి వీలుగా అప్ గ్రేడ్ చేయాలని ప్రభుత్వం ప్రతిపాదన. రీజనల్ రింగు రోడ్డు హైదరాబాద్ నగర ఉత్తర-దక్షిణ ప్రాంతాలనూ, తూర్పు-పశ్చిమ ప్రాంతాలనూ కలుపుతూ జాతీయరహదారి నెట్‌వర్క్‌తో అనుసంధానం. ఎక్స్‌ప్రెస్‌వే ప్రమాణాలను దృష్టిలోఉంచుకొని దీని నిర్మాణానికి తగినంత భూమిని సేకరించే ప్రయత్నం. ట్రాఫిక్ రద్దీకి అనుగుణంగా తొలుత నాలుగు లేన్లతో నిర్మించి దానిని ఎనిమిది లేన్ల సామర్థ్యానికి విస్తరణ. ప్రాథమిక అంచనాల ప్రకారం ఆర్.ఆర్.ఆర్ ఉత్తర ప్రాంత అభివృద్ధికి రూ. 13,522 కోట్లు. దక్షిణ ప్రాంతాభివృద్ధికి రూ. 12,980 కోట్లు ఖర్చు. దీనికోసం బడ్జెట్‌లో ప్రస్తుతం రూ. 1525 కోట్ల ప్రతిపాదన.

## విభజన చట్టంలోని హామీలు ఏపీకేనా?

ఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్-2024లో తెలంగాణకు ఎలాంటి కేటాయింపులు లేకపోవడంతో టీ కాంగ్రెస్ నేతలు మండిపడుతున్నారు. కేంద్ర బడ్జెట్‌లో ఏపీ, బీహార్ మినహా మిగిలిన రాష్ట్రాలకు పెద్దగా ఒరిగిందేమీ లేదు. అది కేంద్ర బడ్జెట్ కాదని.. ఏపీ, బీహార్ బడ్జెట్ అని ఇప్పటికే తెలంగాణ నేతలు విమర్శలు గుప్పించారు. తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగిందని నాగర్ కర్నూల్ లోక్‌సభ ఎంపీ మల్లు రవి అన్నారు. విభజన చట్టంలో ఇచ్చిన హామీలను కేవలం ఆంధ్రప్రదేశ్‌కు మాత్రమే అమలు చేసేలా బడ్జెట్‌లో హామీలు, కేటాయింపులు ఉన్నాయన్నారు. తెలంగాణలోని పాత జిల్లాలలో 9 జిల్లాలకు వెనుకబడిన ప్రాంత నిధులు ఇస్తామని హామీ ఇచ్చి దాని గురించి ఎటువంటి ప్రస్తావన లేదన్నారు. తెలంగాణకు బడ్జెట్‌లో జరిగిన అన్యాయాన్ని వివరిస్తూ ప్రధాని మోదీ, కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కి లేఖలు రాశామన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు కేటాయింపులను మేము వ్యతిరేకించడం లేదు కానీ తెలంగాణకు కేటాయింపులు జరపమని కోరుతున్నామన్నారు. రాష్ట్ర ప్రయోజనాల విషయంలో బీఆర్ఎస్ బీజేపీతో రాజీపడిందన్నారు. బడ్జెట్‌పై చర్చ సందర్భంగా తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని లేవనెత్తుతామన్నారు. తెలంగాణకు న్యాయం జరిగేంతవరకు పార్లమెంట్‌లో పోరాటం చేస్తామని మల్లు రవి అన్నారు. బడ్జెట్‌లో తెలంగాణ కు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దేందుకు ఢిల్లీ వేదికగా ధర్నా చేద్దామని ఎంపీ సురేష్ షెట్కర్ తెలిపారు. కేసీఆర్ వస్తే, రేవంత్ రెడ్డి కూడా వస్తారన్నారు. జంతర్ మంతర్ లో ధర్నా చేసి కేంద్రాన్ని నిలదీద్దామని తెలిపారు. తెలంగాణ బీజేపీ ఎంపీలు కూడా ధర్నా కు కలిసి రావాలని సురేష్ షెట్కర్ పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని బీజేపీ ఎంపీలు వమ్ము చేశారని భువనగిరి లోక్‌సభ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి తెలిపారు. తెలంగాణ నుంచి ఇద్దరు కేంద్ర మంత్రి వర్గంలో ఉన్నప్పటికీ న్యాయం జరగలేదన్నారు. విభజన చట్టం 2014లో ఉంటే అప్పటి నుంచి లేని కేటాయింపులు ఈసారి బడ్జెట్‌లోనే ఎందుకు చేశారని ప్రశ్నించారు. ప్రధాని కుర్చీ కాపాడుకునేందుకే బడ్జెట్‌లో నితీశ్, చంద్రబాబు రాష్ట్రాలకు న్యాయం చేశారని కిరణ్ కుమార్ రెడ్డి తెలిపారు. లోక్ సభ ఎన్నికల్లో బీజేపీకి సహకరించిన బీఆర్ఎస్ నేతలు, ఇప్పుడు కాంగ్రెస్ పై విమర్శలు చేస్తున్నారన్నారు. చిత్తశుద్ధి ఉంటే బీజేపీ ఎంపీలు తెలంగాణకు జరిగిన అన్యాయం పై పోరాటం చెయ్యాలని చామల కిరణ్ కుమార్ రెడ్డి తెలిపారు.

## మంత్రి దామోదర రాజనర్సింహకు వినతిపత్రం అందజేసిన ఎమ్మెల్యే



రాజోలి: అలంపూర్ చౌరస్తాలో నిర్మించిన వంద పడకల ఆసుపత్రిలో వసతులు కల్పించి, ప్రజలకు అందుబాటులో తీసుకురావా లని ఎమ్మెల్యే విజయుడు వైద్య , ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు ఎమ్మెల్యే హైదరాబాద్‌లో మంత్రిని కలిశారు. అదేవిధంగా ప్రజలకు , జర్నలిస్టులకు, ప్రభుత్వ ఉద్యోగులకు ఏపీలో ఆరోగ్యశ్రీ వర్తింపజేయాలని కోరారు. తద్వారా అలంపూర్ నియోజకవర్గ ప్రజలు వైద్యం కోసం హైద రాబాద్‌కు వెళ్లాల్సిన పని ఉండదని వినతిప త్రంలో పేర్కొన్నారు. దీనిపై మంత్రి సానుకూలం గా స్పందించినట్లుగా ఎమ్మెల్యే తెలిపారు.

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను...

తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో బ్యూరో ఇంచార్జీలు, స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జీలు, డివిజన్ ఇంచార్జీలతో పాటు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును. ఆసక్తి కలిగిన వారు సంప్రదించండి.

సయ్యద్ కరీం ఎడిటర్
9440977660, 9110718194

## కాంగ్రెస్ సర్కార్‌ను చీల్చి చెండాడుతాం.. బడ్జెట్‌పై కేసీఆర్




హైదరాబాద్: తెలంగాణ బడ్జెట్ 2024-25పై మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ స్పందించారు. అసెంబ్లీ మీడియా పాయింట్లో కేసీఆర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ బడ్జెట్ అన్ని వర్గాలను మోసం చేసిందన్నారు. అందరినీ వెన్నుపోటు పొడిచిందని విమర్శించారు. "ఇది రైతు శత్రు ప్రభుత్వం. బడ్జెట్‌లో ముఖ్యమైన పథకాల ప్రస్తావనే లేదు. గొర్రెల పంపిణీ పథకం, దళితబంధు, రైతు భరోసా తదితర పథకాలకు కేటాయింపులే లేవు. రైతులను పొగిడినట్లే పొగిడి వెన్నుపోటు పొడిచారు. కథ చెప్పినట్లే ఉంది తప్పా.. బడ్జెట్ పెట్టినట్లు లేదు. కాంగ్రెస్ సర్కార్ ఏర్పడ్డాక సమయమివ్వాలని 6 నెలలపాటు అసెంబ్లీకి రాలేదు. రూ. 2 లక్షల రైతు రుణమాఫీ పేరుతో కొత్త నాటకానికి తెరలేపారు. బడ్జెట్ వాస్తవానికి దూరంగా ఉంది. ఈ ప్రభుత్వం ఏ ఒక్క పాలసీని రూపొందించలేదు. ఒక్క ఇండస్ట్రీ పేరు చెప్పలేదు. ఏ ఒక్క దానిపైనా క్లారిటీ లేదు. మహిళలకూ ఇచ్చిందేమి లేదు. రాష్ట్రంలో విద్యుత్ సరఫరా సరిగ్గా లేదు. ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉంది. ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ శ్రేణులు పోరడతారు. కాంగ్రెస్ మోసపూరిత ఎన్నికల వాగ్దానాలు అమలు చేసే వరకు వదిలిపెట్టేది లేదు" అని కేసీఆర్ స్పష్టం చేశారు.

**తొలిసారి ప్రతిపక్ష నేతగా..** మాజీ ముఖ్యమంత్రి, ప్రధాన ప్రతిపక్ష నేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు తెలంగాణ అసెంబ్లీకి వచ్చారు. గురువారం ఉదయం అసెంబ్లీకి వచ్చిన ఆయనకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పూలబొకే ఇచ్చి స్వాగతం పలికారు. ప్రధాన ప్రతిపక్ష నేతగా తొలిసారి అసెంబ్లీకి కేసీఆర్ హాజరయ్యారు. పదేళ్ల పాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ గత ఎన్నికల్లో ఓటమిని చవిచూసింది. అనూహ్యంగా కాంగ్రెస్ గెలుపొందడం, రేవంత్ రెడ్డి సీఎంగా బాధ్యతలు స్వీకరించడం త్వరత్వరగా జరిగిపోయాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత జరిగిన తొలి అసెంబ్లీ సమావేశాలకు ప్రధాన ప్రతిపక్ష నేత అయిన కేసీఆర్ గైర్హాజరయ్యారు. అయితే ఫలితాల తర్వాత ఫామ్‌హౌస్‌లోని బాత్రూమ్ కాలు జారిపడటంతో కేసీఆర్ తుంటి ఎముకకు శస్త్ర చికిత్స జరిగింది. దీంతో ఆయన కొంతకాలం విశ్రాంతి తీసుకున్నారు. ఈ కారణంగానే ఆయన సమావేశాలకు హాజరుకావడం లేదని బీఆర్ఎస్ నేతలు చెప్పుకుంటూ వచ్చారు. ఇక కొద్దిగా కోలుకున్న తర్వాత ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం చేసేందుకు కేసీఆర్ అసెంబ్లీకి వచ్చారు. అయితే ఈ నెల 23 నుంచి మొదలైన అసెంబ్లీ సమావేశాలకు కూడా కేసీఆర్ గైర్హాజరయ్యారు. కానీ రాష్ట్ర బడ్జెట్ ప్రవేశపెట్టే రోజు కావడంతో కేసీఆర్ ఖచ్చితంగా వస్తారని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు స్పష్టం చేశారు. అసలు కేసీఆర్ సమావేశాలకు హాజరు అవుతారా?... లేదా? అనే దానిపై నిన్న మొన్నటి వరకు సందిగ్ధత నెలకొంది. చివరకు అనుకున్న విధంగానే కేసీఆర్ నేడు అసెంబ్లీ సమావేశాలకు హాజరయ్యారు. ఈనెల 23 నుంచి అసెంబ్లీ సమావేశాలు మొదలయ్యాయి. నేడు అసెంబ్లీలో ప్రభుత్వం రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుంది. ఈ క్రమంలో సమావేశాలు మొదలైన తర్వాత మూడవ రోజు కేసీఆర్ సభకు హాజరయ్యారు. అయితే... బడ్జెట్ ప్రవేశపెట్టే ఒక్కరోజు మాత్రమే కేసీఆర్ సభకు వస్తారని.. తరువాత సభకు దూరంగా ఉండనన్నట్లు సమాచారం. మరి మరికొద్దిరోజుల పాటు జరిగే సమావేశాల్లో మాజీ ముఖ్యమంత్రి పాల్గొంటారా?.. లేరా..? అనేది వేచి చూడాలి.





## బడ్జెట్ అనంతరం కేసీఆర్‌పై భట్టి సంచలన వ్యాఖ్యలు

హైదరాబాద్ : తెలంగాణ అసెంబ్లీ సమావేశాల్లో బడ్జెట్ ప్రవేశపెట్టిన అనంతరం మీడియాతో మాట్లాడిన డిప్యూటీ సీఎం, ఆర్థిక శాఖమంత్రి మల్లు భట్టి విక్రమార్క సంచలన వ్యాఖ్యలు చేశారు. బడ్జెట్‌పై బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ రియాక్షన్‌పై భట్టి కౌంటర్ ఇచ్చారు. 'కేసీఆర్ నిన్న ఎందుకు సభకు రాలేదు..?. ఇంతే హడావుడిగా వెళ్లి కేంద్ర బడ్జెట్‌పై ఎందుకు మాట్లాడలేదు..?. కేంద్ర ప్రభుత్వం చెబితే హడావుడిగా వచ్చారు. వారు చెబితేనే వెళ్లి హడావుడిగా మా మీద మాట్లాడారు.

వారు మాకేంటి సమయం ఇచ్చేది..?. ప్రజలే వారికి విశ్రాంతి తీసుకోమని సమయం ఇచ్చారు. పక్క రాష్ట్రానికి నిధులు ఇస్తున్నారు. ఈ రాష్ట్రానికి మేలు చేయడానికి తెచ్చిందే రాష్ట్ర విభజన చట్టం' అని కేసీఆర్‌పై భట్టి ప్రశ్నల వర్షం కురిపించారు.

**జైలుకు పంపుతాం! :** మరోవైపు కాంగ్రెస్ విప్ బీర్ల ఐలయ్య మాట్లా డుతూ.. కేసీఆర్‌ను తప్పకుండా జైలుకు పంపుతామన్నారు. 'కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను కేసీఆర్ విమర్శిస్తున్నారు. కేసీఆర్ నిన్ను జైలుకు పంపే బాధ్యత మేము తీసుకుంటాం. మీడియా పాయింట్ కు వచ్చిన నువ్వు కోర్టు బోనుకు కూడా వెళ్తావ్ కేసీఆర్..?. గతంలో గొర్ల మీద దొరుకుతున్నది కేసీఆర్. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు పెద్ద పీట వేసింది. ఈ బడ్జెట్ చూసి తెలంగాణ ప్రజలు హర్షిస్తున్నారు. తెలంగణ ప్రజలు ఇప్పటికే మీకు బుద్ధి చెప్పారు' అని ఐలయ్య చెప్పుకొచ్చారు.

PRINTED, PUBLISHED, EDITED AND OWNED BY SYED. KAREEM. PRINTED AT MUZAMMIL PRINTERS BOKKALGUDA, ADILABAD-504001
PUBLISHED AT D.NO. 4-4-122/10/B, VIDYANAGER, ADILABAD - 504001. TELANGANA STATE, REGD. NO. APTEL/2011/41055 ìEDITOR : SYED. KAREEMî CELL - 94409 77660